ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3



చిత్తూరు

జిల్లా వార్తలు

శనివారం 17 ఆగస్టు 2024



→ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



కొవ్వొత్తుల ర్యాలీ

'కోల్‌కత్తా' ఘటనను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి చిత్తూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గిరింపేట దుర్గమ్మ గుడి నుంచి కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ సాగింది. విధుల్లోని జూనియర్ డాక్టరుపై హత్యాచారానికి పాల్పడిన దోషులను శిక్షించాలని ఆ పార్టీ నేత చిట్టిబాబు కోరారు. ఈ విషయంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం దారుణమన్నారు. ఈ ర్యాలీలో మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు నిషిదారాజు తదితరులు పాల్గొన్నారు.



రేపిస్టులను ఉరి తీయండి

చిత్తూరులో వైద్యులు, సిబ్బంది ఆందోళన

చిత్తూరు రూరల్, ఆగస్టు 16: కోల్‌కత్తాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే ఉరి తీయాలని జూనియర్ వైద్యులు, సిబ్బంది డిమాండు చేశారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వైద్యులు, సిబ్బంది ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ఆస్పత్రిలోనే ఇలాంటి ఘటనలు జరిగితే డాక్టర్లు ప్రశాంతంగా ఎలా పనిచేయగలరని ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు జరుగుతూ ఉన్నాయే తప్ప ఆగడం లేదన్నారు. దీనికోసం బలమైన చట్టాలు తీసుకొచ్చి కఠినమైన, తిరిగి ఇలాంటివి చేసేందుకు నిందితులు భయపడేలా శిక్షలు అమలు చేయాలన్నారు. 'ఇలాంటి ఘటనలు జరిగినప్పుడల్లా మేము నిరసన చేస్తున్నాం. మళ్లీ కొన్ని రోజుల తర్వాత ఇలాంటివి జరగడం.. మళ్లీ నిరసనలు చేయడం.. ఇంతేనా? ఇవి ఆగేదెప్పుడు?' అని వారు ప్రశ్నించారు. శనివారం నుంచి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఎమర్జెన్సీ సేవలు తప్ప, మిగతా వైద్య సేవలను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. నిందితులకు శిక్షపడే వరకు.. వైద్యులకు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలు వచ్చేవరకు వైద్య సేవలు కొనసాగించేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై ప్రజలూ ముందుకొచ్చి పోరాడాలని కోరారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు.

నేడు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్ణయం

జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో శనివారం ఓపీ సేవలు నిలిచిపోనున్నాయి. కోల్‌కత్తాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) చిత్తూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 వరకు అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో త్వరగతిన నేర పరిశోధన పూర్తి చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. డ్యూటీలోని వైద్యులకు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రత్యేక రక్షణ చట్టాలను కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, ఏపీలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని కోరారు. కాగా, ప్రభుత్వాలు తీసుకునే చర్యలను బట్టి తదుపరి తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. తమ డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



కుటుంబ సభ్యులతో కలిసి పూజాసామగ్రి తీసుకొస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గత ఐదేళ్లలో రాష్ట్రం దోపిడీ

- ప్రతి అంశంపై అసెంబ్లీలో చర్చ జరగాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఐరాల(కాణిపాకం),ఆగస్టు16: దోపిడీదారుల రాజకీయం వల్ల ఐదేళ్లలో రాష్ట్రం దోపిడీకి గురైందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తుపై జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించిందన్నారు. కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఎమ్మెల్యే మురళీ మోహన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎందరో ప్రాణ త్యాగాలతో దేశానికి వచ్చిన స్వాతంత్ర్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి నాయకుడు చిత్తశుద్ధితో పని చేస్తే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి పార్టీ కృషి చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో ప్రతి అంశంపై చర్చ జరిగితే రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తుందని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యేకి తాను అవకాశం ఇస్తానన్నారు. ప్రతి ఒక్కరూ సభా గౌరవాన్ని కాపాడాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఎమ్మెల్యే కష్టపడి పని చేయాలని కోరారు. దేశంలో రాజధానిలేని రాష్ట్రం ఏపీ ఒక్కటేనని.. త్వరలో రాజధానిని నిర్మించి దేశంలోనే ప్రథమస్థానంలో నిలుపుతామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కాణిపాక ఆలయం మరింత అభివృద్ధి చెందితే ఇక్కడ భూమి విలువ పెరగడంతో పాటు వ్యాపారాలు బాగా సాగుతాయన్నారు.

కాణిపాకంలో వరలక్ష్మీ వ్రతం



వరదరాజస్వామి ఆలయంలో వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 16: కాణిపాకంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయానికి అనుబంధ.. వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి భక్తుల చేత వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహింపచేశారు. వ్రతం పూర్తయిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవు!

- టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు హెచ్చరిక
- కుప్పంలో గ్రానైట్ అక్రమ రవాణాపై సీరియస్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కుప్పం, ఆగస్టు 16: అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల్లో కదలిక లేదు. కానీ, కుప్పం నియోజకవర్గంనుంచి పొరుగు రాష్ట్రాలకు జరుగుతున్న గ్రానైట్ అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవుతున్న వరుస కథనాలకు సీఎం చంద్రబాబు స్పందించారు. పద్ధతి మార్చుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని స్థానిక అధికార పార్టీ నేతలను హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుప్పం మండలంలో వారం రోజుల్లో గ్రానైట్‌ను తరలిస్తూ మూడు వాహనాలు పట్టుబడ్డాయి. నడిమూరు చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన వాహనాన్ని పర్మిట్ ఉందని చెప్పి అధికారులు వదిలేశారు. గుడ్లనాయనిపల్లె క్వారీ వద్ద రెండు వాహనాలలో గ్రానైట్ లోడ్ చేస్తుంటే గ్రామస్థులు అడ్డగించి పోలీసులకు అప్పగించారు. ఇందులో ఒక దానిని పోలీసులు సీజ్ చేసి, ఆర్టీసీ డిపో ఆవరణలో ఉంచారు. రెండోది గ్రానైట్ రవాణాకు సంబంధం లేదని విడిచిపెట్టేశారు. వీటిపై ఆంధ్రజ్యోతిలో నాలుగు రోజులుగా వరుస కథనాలు ప్రచురితమవుతున్నాయి. ఇలాగే గ్రానైట్ అక్రమంగా తరలుతూ పోతే ప్రభుత్వానికి, అధికార పార్టీకి కూడా చెడ్డపేరు వస్తుందని, నియంత్రించాల్సిన అవసరం జిల్లా అధికారులకు ఉందని కథనాలు హెచ్చరించాయి. వీటిపై తహసీల్దారు చిట్టిబాబు మాత్రం స్పందించి కృష్ణదాసనపల్లె క్వారీదాకా సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేసి వచ్చారు. కానీ అటు మైనింగ్, ఇటు పోలీసు శాఖనుంచి కానీ కనీస స్పందన లేదు. చివరకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగారు. నియోజకవర్గంలోని కొందరు నేతలతో టెలిఫోన్‌లో మాట్లాడారు. గ్రానైట్ రవాణాపై ఆంధ్రజ్యోతిలో వస్తున్న కథనాలను ఆయన ప్రస్తావించారు. 'ప్రతిపక్షంలో ఉన్నపుడు మనమే గ్రీన్ ట్రైబ్యునల్‌కు వెళ్లి అక్రమ క్వారీలను ఆపించాం. ఇప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతున్నదంటూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. మీలో ఎవరికైనా ఇందులో ప్రమేయముంటే వెంటనే మానుకోండి' అని చాలా స్పష్టంగా చెప్పారు. గ్రానైట్ అక్రమ రవాణా ఇలాగే జరుగుతుంటే ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు వస్తుందని, తనమీద ప్రజల్లో చెడు అభిప్రాయం కలిగేలా చేస్తుందన్నారు. కుప్పం తన నియోజకవర్గమని, అక్కడ ఎటువంటి తప్పు జరిగినా తనదే బాధ్యత అవుతుందని చెప్పారు. రాష్ట్రం మొత్తానికి కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలని తాను తపన పడుతుంటే, నాయకులు ఇలా అక్రమ వ్యవహారాల్లో తలదూర్చి చెడ్డపేరు తేవడం దారుణమని మండిపడ్డారు. 'నేను చెప్పాల్సింది చెప్పాను. కాదు, మేము గ్రానైట్ అక్రమ రవాణాలో వేలుపెడతామంటే, ఇక మీ ఇష్టం. ఎవరైనా సరే, చట్టం తనపని తాను చేసుకుని పోతుంది. మళ్లీ నా దగ్గరకు రావద్దు. వచ్చినా నా అపాయింట్‌మెంట్ మీకు లభించదు' అని చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అదే సమయంలో గ్రానైట్ అక్రమ రవాణా విషయంలో పట్టనట్లున్న అధికార యంత్రాంగానికి కూడా సీఎంవో కార్యాలయంనుంచి హెచ్చరికలు జారీ అయినట్లు తెలిసింది. ఈ విషయంలో ఎవరైనా ఉపేక్షించవద్దని, అలా చేస్తే అధికారులపైన కూడా చర్యలకు ఉపేక్షించవద్దని సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్లు సమాచారం.


చిత్తూరు అదనపు ఎస్పీ బదిలీ

- హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశం



చిత్తూరు, ఆగస్టు 16: చిత్తూరు అదనపు ఎస్పీ (అడ్మిన్) అరిపుల్లాను బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కడా పోస్టింగు ఇవ్వకుండా.. హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. గతేడాది జిల్లాకు వచ్చిన ఆయన వచ్చే ఏడాది పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆయన్ను మార్చింది. వైసీపీ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పలమనేరు డీఎస్పీగా ఉన్న అరిపుల్లాపై ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి ఎన్నికల కమిషన్ ఆయన మీద బదిలీ వేటు వేసింది. అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందాక మళ్లీ ఆయన జిల్లాకు వచ్చారు.

19న శ్రీసిటీకి సీఎం చంద్రబాబు రాక



తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీసిటీకి ఈనెల 19వ తేదీన రానున్నారు. సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు చంద్రబాబు ఈనెల 19న తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడినుంచి హెలికాప్టర్‌లో శ్రీసిటీ వెళతారు. అక్కడ ఎనిమిది పరిశ్రమలకు భూమి పూజ చేయడంతో పాటు మరో 16 పరిశ్రమలను ప్రారంభించనున్నారు. అలాగే ఐదు పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఎంవోయూలు కుదుర్చుకోనున్నారు. శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో భూమిపూజ, ప్రారంభోత్సవాల తర్వాత ఫాక్స్‌కాన్ పరిశ్రమల ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అనంతరం వివిధ పరిశ్రమల సీఈవోలతో సమావేశం నిర్వహించనున్నారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులతో కలసి శుక్రవారం శ్రీసిటీలో పర్యటించారు. హెలిపాడ్‌ను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

మళ్లీ ఓటర్ల జాబితా సవరణ

- 20 నుంచి ప్రక్రియ ప్రారంభం
- జనవరి 6న తుది జాబితా

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 16: ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. అందుకు సంబంధించిన షెడ్యూలును ప్రకటించింది. జిల్లా అధికార యంత్రాంగం ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఈ నెల 20వ తేదీ నుంచి ఇంటింటి సర్వేతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 2025 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా ఓటరుగా నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. బూత్‌లెవల్ అధికారులు (బీఎల్వో) ఇంటింటికీ వెళ్లి పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి కార్యక్రమాలు అక్టోబరు 18వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. అక్టోబరు 29న ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. వాటిపై సవరణలు, అభ్యంతరాలను నవంబరు 28 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 24లోపు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.



కుప్పంలో సామాన్య ప్రజలతో కలిసి టిఫిన్ తింటూ.. మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తదితరులు

పేదల కడుపు నింపగా..!

- మూడు చోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభం

కుప్పం/పలమనేరు/పుంగనూరు, ఆగస్టు 16: టీ తాగాలన్నా కనీసం పది రూపాయలు ఖర్చు పెట్టాలి. కానీ, అన్న క్యాంటీన్లలో ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం చేయొచ్చు. పూటకు 400 నుంచి 500 మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించనున్నారు. ఇలా నిరుపేదలకు పట్టెడన్నం పెట్టి వారి కడుపు నింపడమే లక్ష్యంగా కుప్పం, పలమనేరు, పుంగనూరులో శుక్రవారం అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటిని మూసేసింది. కొన్ని భవనాలను నిరుపయోగంగా.. మరికొన్నింటిని ఇతర అవసరాలకు వినియోగించింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే టీడీపీ పలుచోట్ల అన్న క్యాంటీన్లను నిర్వహించింది. కూటమి అధికారంలోకి రాగానే తమ హామీ మేరకు రెండు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు అన్న క్యాంటీన్ ప్రారంభించి.. అల్పాహారం తిన్నారు. పూటకు 400 మంది వంతున ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కలిపి 1200 మందికి అందించనున్నట్లు చెప్పారు. పలమనేరు బస్టాండు సమీపంలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. ప్రతి నిరుపేద ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో గతంలో సీఎంగా చంద్రబాబు అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తే జగన్ ప్రభుత్వం మూసేసిందన్నారు. ఆ పేదల కడుపుమంట జగన్‌రెడ్డికి తగిలి ఇంటికి సాగనంపారని అన్నారు. ఇక, పుంగనూరు పట్టణం మదనపల్లె రోడ్డులోని జడ్పీ అతిథిగృహం వద్ద న్న క్యాంటీన్‌ను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, అధికారులు ప్రారంభించారు. రూ.5కే పేదల ఆకలి తీరుతుందన్నారు.



కడుపునింపిన ఆ స్వామి సల్లంగుండాలి

ఈ రోజు వారపుసంత. తెచ్చిన రూ.150తో కాయగూరలు, సరుకులు తీసుకున్నా. ఇక మిగిలింది రూ.20 మాత్రమే. ఆటోకు రూ.15 ఇవ్వాలి. వారపుసంతలో తిరిగి తిరిగి అలసిపోయా. తినాలంటే డబ్బుల్లేవు. బస్టాండు టర్నింగ్ దగ్గర ఈ రోజు నుంచి రూ.5కే భోజనం పెడుతున్నారని ఒకాయన చెప్పాడు. నా దగ్గర మిగిలిన రూ.5తో గడ్డపెరుగు, తాలింపు, సాంబారుతో కడుపునిండా తిన్నా. నాకు అన్నంపెట్టిన సామి ఎవరో కానీ చల్లంగుండాలి.

- గౌరమ్మ, గడ్డూరు కాలనీ

ఈ రోజు కడుపునిండా తిన్నా



ఇంట్లో గొడవపడి పది రోజుల కిందట బయటకు వచ్చేశాను. అప్పట్నుంచి కడుపునిండా అన్నం తినలేదు. ఇక్కడ రూ.5కే అన్నం పెడుతున్నారని రోడ్డు మీద ఎవరో చెబుతుంటే విని వచ్చా. పది రోజుల తర్వాత కడుపు నిండా అన్నం తిన్నా. ఇలా మాలాంటి వారికి అన్నం పెట్టిస్తున్న దేవుడు చంద్రబాబు. దిక్కులేని వారికి ఇక్కడ మంచి అన్నం దొరుకుతుంది.

- పాపులమ్మ, గోసువారిపల్లె, రామసముద్రం మండలం

కారు, ద్విచక్ర వాహనం ఢీ

- ఘటనా స్థలంలో తండ్రి, ఆస్పత్రిలో కూతురు మృతి
- చికిత్స పొందుతున్న తల్లి, మరో కుమార్తె



రోడ్డుపై ఉన్న ద్విచక్ర వాహనం

అబ్బాస్ హుస్సేన్ (ఫైల్ ఫొటో), మృతిచెందిన షబ్నం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రతం రోజున ఆ ఇంట్లో విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదం రూపంలో తండ్రీ పెద్ద కుమార్తెను మృత్యువు తీసుకెళ్లిపోయింది. తల్లి, చిన్న కూతురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లెకు చెందిన అబ్బాస్ హుస్సేన్ (31), భార్య హసీమా(27), కుమార్తెలు షబ్నం (3), తమ్జీమ్(6 నెలలు) ద్విచక్ర వాహనంపై చిత్తూరు ఆస్పత్రికి చేరుకున్నారు. తమ్జీమ్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చూపించారు. తర్వాత చిత్తూరు నుంచి గంగాధరనెల్లూరు మండలంలోని వీరకనెల్లూరులో నిర్వహించే పీర్ల ఊరేగింపులో పాల్గొనేందుకు బయలుదేరారు. నెల్లేపల్లె సమీపంలో వస్తుండగా వారి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అబ్బాస్ హుస్సేన్, హసీమా, షబ్నం, తమ్జీమ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వస్తున్న వాహనదారులు 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వచ్చేలోపే అబ్బాస్ హుస్సేన్ మృతిచెందాడు. హసీమా, ఇద్దరు కుమార్తెలను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షబ్నం చికిత్స పొందుతూ మృతి చెందింది. హసీమా, తమ్జీమ్ చికిత్స పొందుతున్నారు. గంగాధరనెల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.





స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతీ దేవి

పసిడి చీరలో పద్మావతమ్మ

- తిరుచానూరులో ఘనంగా వరలక్ష్మి వ్రతం

తిరుచానూరు, ఆగస్టు 16 : తిరుచానూరులో కొలువైన పద్మావతీ దేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కనులపండువగా వరలక్ష్మి వ్రతం జరిగింది.అమ్మవారి ఉత్సవమూర్తిని బంగారు చీరలో ఆస్థాన మండపంలోని పద్మపీఠంపై కొలువుదీర్చారు.సంప్రదాయ పుష్పాలతో ఆరాధించి అమ్మవారిని 9 గ్రంథులతో అలంకరించారు.12రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన వరలక్ష్మి వ్రతం మధ్యాహ్నం 12గంటలకు మహా మంగళహారతితో ముగిసింది. సాయంత్రం మహాలక్ష్మి అలంకరణలో స్వర్ణరథంపై కొలువుదీరిన పద్మావతీ దేవి మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించింది.టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం ఆకట్టుకుంది.20వేల కట్ ఫ్లవర్స్‌తో మూడు రోజుల పాటు 15మంది సిబ్బంది శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, వ్రత మండపాన్ని సుందరంగా అలంకరించారు.పద్మావతీ దేవిని దర్శించుకోవడానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు.సర్వదర్శనానికి గంటన్నరకుపైగా పట్టింది.ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు,జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, వీజీవో నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కళంకిత కార్పొరేటర్లు అవసరమా?

- టీడీపీలో చేరేందుకు వైసీపీ కార్పొరేటర్ల తహతహ
- వారంతా భూమన షాడోలంటున్న స్థానిక నాయకులు
- తర్వాత చూస్తామని తిప్పిపంపిన పార్టీ అధిష్ఠానం



మంత్రి రాంప్రసాద రెడ్డితో అన్నా రామచంద్ర, సిద్ధారెడ్డి తదితరులు

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్లలో అరాచకశక్తులుగా మారి ప్రజలను ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టిన కొందరు వైసీపీ కార్పొరేటర్లు ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు. పార్టీ కండువా కప్పేసుకుంటామని కూటమి నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి తలపడ్డవారి బతుకు మీద కొట్టడమే కాక చేయాల్సిన అరాచకాలన్నీ చేసేసి అవేమీ గుర్తు లేనట్టుగా జంపింగ్‌కు సిద్ధపడుతున్న వారికి కొందరు కూటమి నేతలు రెడ్‌కార్పెట్ పరుస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ అధికారంలో ఉండగా ఎలాంటి పదవీ లేకపోయినా ముఖ్యనేతకు దగ్గరగా మెలిగిన ఓ కీలక నేత టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.అప్పట్లో ఎలాంటి సెటిల్‌మెంటైనా అతడి కార్యాలయంలోనే జరిగేది. తన ఇంటిలో ఓ కార్పొరేటర్ ఉండగా, సమీప బంధువు మరొకరు,అనుచరులైన మరో ముగ్గురు మొత్తం ఐదుగురు కార్పొరేటర్లను కూటమిలోకి తీసుకొస్తానంటున్న ఆయన డిప్యూటీ మేయర్ పదవి తన కుటుంబానికే ఇవ్వాలని డిమాండు చేస్తున్నట్టు సమాచారం.43వ డివిజన్లో పోటీకి దిగిన టీడీపీ అభ్యర్థికి చెందిన టీ దుకాణాన్ని అధికార బలంతో ధ్వంసం చేశారు.45వ డివిజన్ పరిధిలో టీ దుకాణం నడుపుతున్న ఓ టీడీపీ కార్యకర్తపై దాడి చేసి గాయపరిచారు. ఎన్నికల ముందు 'జగన్ రెడ్డి మరో 30 ఏళ్లు సీఎంగా ఉంటారు. మా పార్టీలోకి వచ్చేయండి' అని భయపెట్టిన వైసీపీ నేతలు కూడా ఇప్పుడు కూటమిలోకి వచ్చేందుకు పరితపిస్తున్నారు.మూడున్నరేళ్లుగా అధికారబలంతో టిఫిన్ బండి నుంచి కూడా మామూళ్లు వసూలు చేసుకోవడానికి అలవాటు పడ్డ ఇంకొందరు కార్పొరేటర్లు కూడా పార్టీ మారేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.డివిజన్లో ఇల్లు కట్టుకునేందుకు ఎవరైనా ఇటుకలు తోలుకుంటే కూడా డబ్బులు డిమాండు చేసిన కార్పొరేటర్లు ఇప్పుడు కూటమిలోకి రావడం వలన ఎవరికి ప్రయోజనమో పార్టీ అధిష్ఠానం బాగా ఆలోచించాల్సివుంది.

మేయర్ రాకపోతే వీరొచ్చినా ఉపయోగంలేదు

50 డివిజన్లున్న తిరుపతి కార్పొరేషన్‌కు మూడున్నరేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. నామినేషన్ ఉపసంహరణ సమయంలో వివాదం జరిగి ఒక డివిజన్‌కు ఎన్నిక ఆగిపోయింది. మిగిలిన 49 డివిజన్లలో అధికార బలంతో 28 డివిజన్లను ఏకగ్రీవాలు చేసుకున్నారు. అంటే మేయర్ బెర్త్‌ను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. తక్కిన 21 డివిజన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క డివిజన్లోనే టీడీపీ జెండా ఎగురవేసింది. దొంగ ఓట్లతో వైసీపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అయితే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమి పార్టీల్లో చేరారు. ఇద్దరు టీడీపీలోకి, ముగ్గురు జనసేనలోకి మారారు. అయితే నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకు మేయర్‌పై అవిశ్వాసం పెట్టకుండా గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ చట్టాన్ని సవరించింది. దీంతో నో కాన్ఫిడెన్స్ మోషన్ కాలవ్యవధిని కుదిస్తూ చట్ట సవరణ మళ్లీ చేస్తే తప్ప కొత్త మేయర్ ఎన్నిక జరగదు. నాలుగేళ్లు పూర్తయ్యేందుకు ఇంకా ఆరు నెలల సమయముంది. పార్టీ మారేందుకు సందిగ్ధంలో ఉన్న మేయర్ డాక్టర్ శిరీష వైసీపీలోనే కొనసాగేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. అందువల్ల ఇప్పటికిప్పుడు మెజారిటీ కార్పొరేటర్లు కూటమి వైపు వచ్చినా కూటమి ఖాతాలోకి మేయర్ పీఠం చేరదు.

ఇందుకేనా వచ్చేది?

వైసీపీ స్థానిక నాయకత్వం అనుమతితోనే కొందరు కార్పొరేటర్లు కూటమిలోకి వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీలో ఉంటే అన్నివిధాలా ప్రయోజనాలు పొందవచ్చని, ఇక్కడి రహస్యాలను చేరవేసేందుకు కూడా అవకాశం ఉంటుందన్న రాజకీయ కోణంతో వైసీపీ నాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పాటు మరో ఏడాదిన్నరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తమ కార్పొరేటర్ సీటును అధికార పార్టీనుంచి హామీ తీసుకుని పోటీ చేయాలని మరికొందరు పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారు.శ్రీకాళహస్తికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేని వెంటబెట్టుకుని శుక్రవారం ఓ పదిమంది కార్పొరేటర్లు విజయవాడ బాట పట్టారు. పార్టీ కండువాలను కప్పేసుకోవడానికి సిద్ధపడితే, ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశం తరువాత స్థానిక నాయకత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని టీడీపీ ముఖ్యనేతలు తిప్పి పంపినట్టు తెలిసింది.

వీరి గురించి సమాచారమివ్వండి

టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న కార్పొరేటర్ల గురించి ఆరా తీసేందుకు పార్టీ అధిష్ఠానం సిద్ధమైంది. ఆదం సుధాకర రెడ్డి కుమార్తె ఆదం లీల (9వ డివిజన్ కార్పొరేటర్), దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి(10వ డివిజన్), దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి భార్య ప్రవళ్లికా రెడ్డి(11), మహేష్ రెడ్డి భార్య షాలిని రెడ్డి (15), వెంకటముని రెడ్డి తల్లి రాజమ్మ (20), డిష్ చంద్ర భార్య సునీత (22), పొన్నాల చంద్ర (28), దూది శివ భార్య కుమారి (33), మునిరామి రెడ్డి భార్య శ్రావణి (34), కుడితి సుబ్రమణ్యం (36), బాలసుబ్రమణ్యం భార్య గీత (37), నరేంద్ర నాథ్(38), మురళీ యాదవ్ భార్య రాధ (43), పెంచలయ్య భార్య రాణి (46), అనిల్ (50), ఈశ్వరి (21), అనీష్ రాయల్ (45)తో పాటు ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన అన్నా రామచంద్రయ్య కుమార్తెలు అన్నా సంధ్య (48), అన్నా అనిత (49వ డివిజన్ కార్పొరేటర్)ల గురించి పూర్తి సమాచారం కావాలని స్థానిక నాయకత్వాన్ని టీడీపీ కోరినట్లు సమాచారం.

వాళ్లను తీసుకోవద్దు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతి

ఐదేళ్లుగా తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ కార్పొరేటర్లను పార్టీలోకి తీసుకోవద్దని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును స్థానిక టీడీపీ నేతలు కోరారు. శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడికి వైసీపీ కార్పొరేటర్ల ఆగడాల గురించి వివరించారు. స్థానిక నాయకత్వానికి ఎలాంటి సమాచారం లేకుండా పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివలన పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లి ఆ పార్టీలో కూడా చేర్చుకోనివ్వకుండా చూడాలని కోరారు. పల్లా శ్రీనివాసరావును కలిసినవారిలో 43వ డివిజన్ ఇంచార్జి ఆర్సీ శ్రీనివాసులు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు మునిశేఖర్ రాయల్, బాలసుబ్రమణ్యం రెడ్డి, సుబ్రమణ్యం ఉన్నారు.



టీడీపీలో చేరేందుకు విజయవాడ వెళ్లిన వైసీపీ కార్పొరేటర్లు, నేతలు



జయహో

షార్‌లో సంబరాల హోరు

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరోసారి మెరిసింది. ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ప్రయోగ విజయంతో మరో చారిత్రాత్మక మైలురాయిని దాటింది. చిన్న ఉపగ్రహ వాహక నౌక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు ఈవోఎస్-08 ఉపగ్రహంతో పాటు మరో రెండు బుల్లి ఉపగ్రహాలను దిగ్విజయంగా కక్ష్యలో ప్రవేశపెట్టడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని తిలకిస్తున్న శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇది శాస్త్రవేత్తలు దేశానికి ఇచ్చిన కానుకగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభివర్ణించారు.రాకెట్ విజయానికి అహర్నిశలూ పనిచేసిన శాస్త్రవేత్తలను అభినందించారు.



రాకెట్ మొదటి దశ



రెండవ దశ



మూడవ దశ



నాల్గవ దశలో విడిపోతున్న ఉపగ్రహం

దశల వారీగా రాకెట్ విడిపోయింది ఇలా..

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ అన్ని దశలనూ సునాయాసంగా పూర్తి చేసుకొని 17 నిమిషాల్లో ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. 34 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, 119 టన్నుల బరువు గల రాకెట్ తన మొదటి దశలో 87 టన్నుల ఘన ఇంధనంతో భూమి నుంచి నింగిలోకి పయనమై 124 సెకన్లకు 93 కి.మీ ఎత్తులో తొలి దశ పూర్తి చేసుకొంది. 7.7 టన్నుల ఘన ఇందనంతో 125 సెకన్లకు ప్రారంభమైన రెండో దశ 420 సెకన్లకు 450 కి.మీ ఎత్తులోకి వెళ్లి పూర్తి చేసింది. అనంతరం మూడవదశ ప్రారంభమై 4.5 టన్నుల ఘన ఇంధనంతో వేగంగా 697 సెకన్లకు 475 కిలోమీటర్ల ఎత్తుకు చేరింది. అనంతరం 0.05 టన్నుల ద్రవ ఇంధనంతో నాలుగో దశ ప్రారంభమై రాకెట్‌లో ఉన్న ఈవోఎస్-08 ఉపగ్రహం 808 సెకన్లకు కక్ష్యలోకి విడిపోయింది. అనంతరం 994 సెకన్లకు ఎస్ఆర్-0, డెమోశాట్ ఉపగ్రహాలు కూడా ఒకదాని తరువాత రోదసీలోకి ప్రవేశపెట్టారు. సంవత్సరం పాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది.

\- సూళ్లూరుపేట



ఎర్రచందనం స్మగ్లర్లు, దుంగలతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

ఏడు దుంగలు, కారు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, ఆగస్టు 16: భాకరాపేట రేంజ్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి దుంగలు, కారు, మోటారు సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీమ్ గురువారం సాయంత్రం భాకరపేట చేరి, స్థానిక అటవీ అధికారులతో కలసి కోటకాడపల్లి, ఉస్తికాయలపెంట మీదుగా పింఛా వైపు కూంబింగ్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయలపెంట ఎస్టీ కాలనీ చేరుకోగా, అక్కడ కొంతమంది కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. వారిని టాస్క్‌ఫోర్స్ అధికారులు గమనించి చుట్టుముట్టారు. పారిపోయే ప్రయత్నం చేయగా వారిలో ఆరుగురిని పట్టుకోగలిగారు. తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన అనుమాన్ (42), సెంజి వేడి (26), చిన్న వేడి (22), మురుగేశన్ (32), ఆయనార్ (23), శివానందం (37)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి ఏడు ఎర్రచందనం దుంగలు, కారు, మోటారు సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

నేడు టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 16: వివిధ కారణాలతో రెండుసార్లు వాయిదా పడిన టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ శనివారం నుంచి కొనసాగనుంది. సర్‌ప్లస్ టీచర్లకు సంబంధించిన జాబితా ఎంఈవోల లాగిన్‌కు వస్తుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంఈవో కార్యాలయంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరుగుతుంది. తొలుత స్కూల్ అసిస్టెంట్లు, ఆపై సెకండరీ గ్రేడ్ టీచర్లు, పీడీలకు నిర్వహిస్తారు. 'మీరు సర్‌ప్లస్ టీచర్‌గా ఉన్నారు' అంటూ సమాచారం వచ్చిన టీచర్లు ఎంఈవో కార్యాలయంలో హాజరై ఏ పాఠశాలలో అడ్జస్ట్‌మెంట్ కావాలో కోరుకోవాల్సి ఉంది.

ఎర్రచందనం కేసులో ముగ్గురికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా జడ్జి ఎ.నారాయణమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాల మేరకు 2014సెప్టెంబరు 26న చిన్నగొట్టిగల్లు మండలం బోడిరెడ్డిగారిపల్లె ఎస్టీకాలనీ వద్ద ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న మిట్టపల్లి ధనంజయరెడ్డి, తుపాకుల రామచంద్ర, తుపాకుల వెంకట్రామయ్యలను భాకరాపేట పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదుచేశారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురికి జైలు శిక్ష ఖరారుచేశారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.నగేష్ వాదించారు. కేసు నిరూపణకు కృషి చేసిన దర్యాప్తు అధికారి ఎన్.కంటయ్య, కోర్టు లైజన్ ఆఫీసర్ రాజగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీవారిపాదాల వద్ద వేడుకగా ఛత్రస్థాపనోత్సవం



తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమల నారాయణగిరి శ్రీవారిపాదాల వద్ద శుక్రవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ఈసందర్భంగా శ్రీవారిపాదాల వద్ద టీటీడీ అర్చకబృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించారు. తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పూజాసామగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడవీధుల గుండా అర్చక బృందం మేదరమిట్టకు చేరుకుంది. అక్కడి నుంచి వాహనంలో శ్రీవారిపాదాల వద్దకు చేరుకున్నారు. ముందుగా శ్రీవారిపాదాలకు తిరుమంజనం చేపట్టారు. ఈసందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. తర్వాత భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ అర్చకుల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

సర్వదర్శనానికి 16 గంటలు



అలిపిరిలో భారీగా నిలిచి ఉన్న వాహనాలు

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. కాలినడక మార్గాలతోపాటు ఘాట్‌రోడ్లు, అలిపిరి చెక్ పాయింట్ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో శుక్రవారం సాయంత్రం సమయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లతోపాటు నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వీరికి దాదాపు 16 గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతం, లడ్డూ వితరణ కేంద్రం, కొబ్బరికాయలు సమర్పించే అఖిలాండం, అన్నప్రసాద భవనం వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. ఇక, గదులకు డిమాండ్ పెరిగింది. ఒక గది పొందేందుకు దాదాపు 2 నుంచి 3 గంటల సమయం పడుతోంది. అలాగే తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ప్రైవేటు ఆస్పత్రులు నేడు బంద్

కుప్పం, ఆగస్టు 16: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్‌లో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ కుప్పంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీడీ సేవలు నిలిపివేస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. ఐఎంఏ సూచనల మేరకు తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు ప్రకటించారు. అయితే రోగులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర సేవలను మాత్రం కొనసాగిస్తామని చెప్పారు. వైద్యుల భద్రతకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.

గంగవరం: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా 24 గంటల పాటు అత్యవసర వైద్యసేవలు మినహా, మిగిలిన అన్ని వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు పలమనేరు ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్ తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రైవేటు వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

గజ బాధితులకు నష్టపరిహారం చెల్లింపు



రైతుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

కుప్పం, ఆగస్టు 16: కుప్పం నియోజకవర్గంలో ఏనుగుల దాడుల్లో పంట నష్టం జరిగిన ఏడుగురు రైతులకు శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు ప్రభుత్వం తరఫున నష్టపరిహారంగా రూ.80 వేలు ఆర్థిక సాయం అందించారు. పరిహారం అందుకున్న వారిలో గుడుపల్లె మండలం ఓఎన్.కొత్తూరు పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన రైతులు తీర్థగిరి, చినస్వామి, పవన్‌రాజ్, వెంకటేశ్, సతీమల్లై, మురుగేశ్, మాదప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో జయశంకర్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయానికి స్థల పరిశీలన

కుప్పం, ఆగస్టు 16: కుప్పంలో డీఎస్పీ కార్యాలయానికి అవసరమైన స్థలం కోసం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల, కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి శుక్రవారం పరిశీలన జరిపారు. పురపాలక సంఘం పరిధిలోని కొత్తపేట మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ సమయంలో స్థానికులు కలెక్టర్‌ను కలిశారు. గతంలో కొత్తపేటనుంచి రైల్వే గేటు మార్గం ద్వారా అటువైపు నేతాజీ రోడ్డులోకి రాకపోకలు సాగించడానికి మార్గముండేదని, అయితే రైల్వే అధికారులు ఈ మార్గాన్ని మూసేస్తూ గోడ కట్టేశారని ఫిర్యాదు చేశారు. రాకపోకలు ఆగిపోవడంవల్ల తమకు ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గోడ కట్టిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట ప్రజలకు హామీ ఇచ్చారు.

అమ్మవార్లకు విశేష పూజలు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 16: బైరెడ్డిపల్లెలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక బాటగంగమ్మ ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, నల్లా పురెమ్మ ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇళ్లలో అమ్మవారిని విశేషాలంకరణతో కొలువుదీర్చి వివిధ రకాల పండ్లు, పిండి వంటలు నైవేద్యంగా పెట్టి మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు. పలువురిని ఇళ్లకు పేరంటాలకు ఆహ్వానించి పసుపు, కుంకుమ, ప్రసాదాలు అందజేశారు.



బైరెడ్డిపల్లెలోని ఓ ఇంట్లో అలంకారం

వేతనాలు చెల్లించకుంటే సమ్మెకు దిగుతాం




ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గంగవరం, ఆగస్టు16: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలపై స్పందించకుండా, సక్రమంగా వేతనాలు చెల్లించకపోతే సమ్మెకు దిగడం ఖాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిరిధర్‌గుప్త, ఓబులు రాజులు హెచ్చరించారు. పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు 5 నెలల నుంచి వేత నాలు అందకపోవడంతో, కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వక పోవడంతో వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. జీతాలు ఇవ్వకపోగా వారిని వేధించడం సబబు కాదన్నారు. 100 పడకల ఆస్పత్రిగా మార్చినా అందుకు తగ్గట్లు అదనపు సిబ్బందిని నియమించక పోవడంతో ఉన్న సిబ్బందిపై అదనపు పనిభారం పడిందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుజ్జమ్మ, లలిత, ఈశ్వరమ్మ, నాగమ్మ, వేణుగోపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యగంగమ్మకు నోట్ల అలంకరణ

గంగవరం, ఆగస్టు16: పట్టణంలోని పాతపేటలో వెలసిన సత్యగంగమ్మ ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని శ్రావణ శుక్రవారం సందర్భంగా సుమారు. రూ. 3 లక్షల విలువైన రూ.500 నోట్లతో అలంకరించారు. కరెన్సీ నోట్లతో పాటు పూలాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



20 నుంచి ఆత్మజ్ఞాన తరగతులు

పలమనేరు, ఆగస్టు 16 : పలమనేరులోని శ్రీక్రిష్ణా పిరమిడ్ ధ్యానశక్తి కేంద్రంలో ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు ప్రముఖులచే ఆత్మజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రవీంద్రశెట్టి, నాగరాజరెడ్డి, చిన్నయ్యశెట్టి తెలిపారు. క్రిష్ణాష్టమి పురస్కరించుకొన ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. రాత్రి 8.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

కలగా మిగిలిన సబ్‌ట్రెజరీ కార్యాలయ భవనం..!

పలమనేరు, ఆగస్టు16 : పలమనేరులో సబ్‌ట్రెజరీ కార్యాలయ సొంత భవనం కలగా మిగిలి పోయింది. బ్రిటీషు హయాంలో పోలీసుస్టేషన్, తహసిల్దార్ కార్యాలయం, సబ్‌ట్రెజరీ కార్యాలయం ఒకే భవనంలో ఏర్పాటు చేశారు. పోలీసుస్టేషన్‌కు 20 ఏళ్లక్రితం, తహసీల్దార్ కార్యాలయానికి ఆరేళ్ల క్రితం నూతన భవనాలు నిర్మించారు. సబ్ ట్రెజరీ కార్యాలయం మాత్రం బ్రిటీషు హయాంలో నిర్మించిన భవనంలోనే నాలుగేళ్లక్రితం వరకు కొనసాగింది. ఆ భవనం వర్షాలకు పూర్తిగా తడిచి ముద్దవుతున్నందున మూడేళ్లక్రితం అద్దెభవనంలోకి మారింది. ఈ కార్యాలయం పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు సేవలందిస్తోంది. ఈ క్రమంలో నూతన సబ్‌ట్రెజరీ కార్యాలయ నిర్మాణానికి 2019 మార్చి20న అప్పటి మంత్రి, ఇప్పటి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి శంకుస్థాపనచేశారు. ఇందుకోసం రూ.75లక్షలు మంజూరు చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ఈ పనుల ఊసేలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి. ప్రభుత్వం స్పందించి నూతన భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఇక్కడి అధికారులు, ఉద్యోగులు కోరుతున్నారు.



సబ్‌ట్రెజరీ కార్యాలయం నిర్మాణానికి వేసిన వేసిన శిలాఫలకం

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఆగస్టు16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, రాహుకాలంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు రాహుకాల పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈవో ఏకాంబరం అన్నదాన ఏర్పాట్లను పర్య వేక్షించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, ఆగస్టు16: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిపించి అమ్మవారిని ప్రత్యేకంగా అలం కరించి భక్తులకు దర్శనం కల్పించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి



అధికారులతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు16: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం జడ్పీ గెస్ట్‌హౌస్‌లో అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ సీఐ రాంభూపాల్‌కు సూచించారు. ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తులు భూములు ఆక్రమించినా అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, వంకలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. పట్టణంలో పారిశుధ్యం, వీధి లైట్లు, తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహాప్రసాద్‌రెడ్డికి సూచించారు. పనుల కోసం ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదని, అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాము, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ డీఈ మహేశ్, ఎస్‌ఐ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు కరెన్సీ అలంకరణ

పుంగనూరు రూరల్, ఆగస్టు16: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణ, మండల పరిధిలోని అమ్మవారి ఆలయాలు, ఇళ్లలోను భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని విరూపాక్షి మారెమ్మను కరెన్సీ నోట్లతో అలంకరించారు. భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలోని పార్వతిదేవి, కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



ఎగ్జిబిషన్ కూలీలకు సరుకుల వితరణ

పుంగనూరు రూరల్, ఆగస్టు16: ఇటీవల కురసిన వర్షానికి పుంగనూరులో ఎగ్జిబిషన్ నీటమునగడంతో వలస కార్మికుల ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు వారికి నిత్యావసర సరుకులు వితరణ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఎగ్జిబిషన్ కూలీలకు మానవతా సంస్థ ప్రతినిధి దాత వనిత రూ. 3500 విలువ చేసే సరుకులు అందజేశారు. సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య, సంస్థ ప్రతినిధులు నారాయణ రెడ్డి, నానబాల గణేశ్, నరసింహారెడ్డి, హరినాథ్‌రెడ్డి, జగన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే బాబు ధ్యేయం

కుప్పం, ఆగస్టు 16: పేదలకు పట్టెడన్నం పెట్టి వారి ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్‌కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పంలోని రాధాకృష్ణరోడ్డులో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం వారు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలనుంచి కుప్పం వచ్చిన నిరుపేదలకు ఆకలిబాధలు ఉండవన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదలకు బహుమతిగా ఇచ్చారన్నారు. ఈ నిరంతరాన్నదాన కార్యక్రమం కోసం అన్న క్యాంటీన్ల నిర్వహణకు ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఒక కోటి రూపాయలు విరాళమిచ్చి తమ ఔదార్యాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్.సురేశ్ బాబు, రాజ్‌కుమార్, ప్రేమ్ కుమార్ లతోపాటు పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. వీరంతా పేదలతో కలిసి అన్న క్యాంటీన్‌లోనే టిఫిన్ చేశారు.



అన్న క్యాంటీన్‌లో ప్రజలకు వడ్డిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

ఆకలి తీర్చడం ఆనందదాయకం



అన్నక్యాంటిన్‌లో అల్పాహారం స్వీకరిస్తున్న చల్లా బాబు

పుంగనూరు, ఆగస్టు16: పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లు ప్రారంభించారని, ఇది పేదలకు ఆనందదాయకమని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మదనపల్లె రోడ్డులోని జడ్పీ గెస్ట్‌హౌస్ ఆవరణ ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ప్రజలు, రైతులు, అధికారులతో కలసి ఆయన అన్నక్యాంటీన్‌లో అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం రూ.5కే టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. రూ.15లకే మూడు పూటలా కడుపు నింపడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. గతంలో జగన్ అన్న క్యాంటీన్లు ఎత్తేసి పేదల కడుపు మద్దారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, టీడీపీ మాజీ ఇన్‌చార్జి వెంకటరమణ రాజు, టీడీపీ నాయకులు ఎం. శ్రీకాంత్, గువ్వల రమేశ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, న్యాయవాది వెంకటముని, సుహేల్‌బాషా, శమీపతి, గంగాధర్, రామయ్య, రామకృష్ణరాజు, దేశాధిప్రకాశ్, రమణ, ప్రసాద్‌రెడ్డి, నటరాజ, రాఘవ, సద్దాం హుసేన్, నదీమ్‌బాషా,అబ్బాస్ రొంపిచెర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, చిన్నరాయల్, నరేశ్‌రాయల్, చైతన్యరాయల్, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, మల్లికారాణి పాల్గొన్నారు.

వంద భోజనం రూ.5కే ఇస్తున్నారు



భోజనం చాలా బాగుంది. హోటల్‌లో రూ.100కు పెట్టే భోజనం పేదల కోసం చంద్రబాబు రూ.5కే ఇస్తున్నారు. పేదల కోసం పనిచేసే చంద్రబాబు ప్రభుత్వం పదికాలాల పాటు ఉండాలి. దూర ప్రాంతాల నుంచి పనుల కోసం పట్టణానికి వచ్చేవారికి ఆకలి బాధలు ఉండవు.

- మనోజ్, దోభీకాలనీ, పుంగనూరు

రూ.5కు టీ కూడా రాదు.. బాబు అన్నం పెడుతున్నాడు



రూ.5కు బజారులో టీ కూడా రాదు. మా లాంటి వాళ్ల కోసం సీఎం చంద్రబాబు ఇంత తక్కువ డబ్బులతో అన్నం పెట్టి కడుపునింపుతున్నాడు. చాలా బాగా ఇక్కడ టిఫెన్ పెట్టారు. రుచిగా ఉంది. చంద్రబాబును దేవుడు చల్లగా చూడాలి. **- ఆదెమ్మ, భీమగానిపల్లె**

గ్రీవెన్స్ డేకు 58 అర్జీలు

కుప్పం, ఆగస్టు 16: కుప్పంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానిక మండల సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన ప్రజలు ఏకంగా 158 అర్జీలు వివిధ సమస్యలపై సమర్పించారు. ఇందులో కేవలం రెవెన్యూ సంబంధిత సమస్యలకు సంబంధించిన అర్జీలే 88 ఉన్నాయి. మున్సిపాలిటీకి సంబంధించిన అర్జీలు 19, హౌసింగ్ కార్పొరేషన్ 10, సివిల్ సప్లయిస్ 11, సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ 7, ఆర్‌డబ్ల్యూఎస్ 5, పంచాయతీరాజ్ 3, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, పోలీస్, దేవాదాయ శాఖలకు సంబంధించి రెండేసి, వ్యవసాయ శాఖ, కడా, రూరల్ డెవలప్‌మెంట్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, సోషియల్ వెల్ఫేర్, లేబర్, ఆర్ అండ్ బి శాఖలకు సంబంధించి ఇక్కో అర్జీ వచ్చింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి గ్రీవెన్స్‌డేలో పాల్గొన్న కలెక్టర్ ప్రతి ఒక్క అర్జీదారు సమస్యను ఓపికగా విన్నారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్య వెంటనే పరిష్కరిం చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, ఆర్డీవోతోపాటు జిల్లా, నియోజకవర్గ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

పేదల కడుపు నింపడానికే అన్నక్యాంటీన్ : అమర్



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అమర్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

గంగవరం, ఆగస్టు 16: పేదల కడుపు నింపడానికే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు బస్టాండ్ పరిధిలో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అన్నం పెట్టడం లో కలిగే ఆత్మసంతృప్తికి విలువలు కట్టలేమన్నారు. అలాంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు నిర్ణయం గర్వించదగ్గ విషయమన్నారు. అన్న క్యాంటీన్లు తొలగించిన పాపానికి జగన్ మూల్యం చెల్లించారని పేర్కొన్నారు. రూ.5కే భోజనం అందించడం పేదలకు నిజంగా వరమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమం ముందుకు సాగడానికి దాతలు సహకరించి విరాళాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, టీడీపీ నాయకులు ఆర్‌బీసీ కుట్టి, సోమ శేఖర్ గౌడు, కిషోర్ గౌడు, రంగనాథ్, నాగరాజురెడ్డి, గిరిబాబు, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, ఖాజాపీర్ మురళి, పర్వీన్, ఆనంద్ పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉంది



నేను మార్కెట్‌కు వచ్చా. ఆకలిగా ఉంటే లోపలికి వెళ్లి రూ.5 ఇచ్చా. ఒక ప్లేట్ అన్నం, సాంబారు, తాలింపు, పెరుగు, ఊరగాయ అన్నీ ఇచ్చారు. రూ.100 ఇస్తే కూడా కడుపునింపకోలేని ఈరోజుల్లో రూ.5కే భోజనం పెట్టడం అభినందనీయం. చంద్రబాబు సుఖీభవ.

- శ్రీనివాసులు, రైతు, నెల్లిపట్ల నల్లగుట్లపల్లి

డెంగ్యూ కేసులున్నా ఫాగింగ్ చేయరు

మండల మీట్‌లో వైద్య అధికారుల అసహనం

సోమల, ఆగస్టు 16: మండలంలోని పలు గ్రామాల్లో 8 డెంగ్యూ కేసులు ఉన్నా పంచాయతీ కార్యదర్శులు దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని వైద్య అధికారులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో దోమల నివారణ కోసం పంచాయతీ కార్యాలయాల్లోని ఫాగింగ్ యంత్రాలు ఉన్నా వాటిని వినియోగించడంలేదని కందూరు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మీ సభ దృష్టికి తెచ్చారు. ఎంపీడీవో నారాయణ స్పందిస్తూ గ్రామాల్లో ఫాగింగ్ చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. మండలంలో లోఓల్టేజీ సమస్య నివారణ కోసం పత్రపల్లె, అడుసుపల్లెలో సబ్‌స్టేషన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి చెప్పారు. అడవిపందులు, ఏనుగుల బెడదతో మండలంలో వేరుశనగ సాగు తగ్గిపోయిందని ఏవో సుధాకర్ తెలిపారు. అటవీ శివారు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అటవీశాఖ అధికారి ఇంద్రాణి తెలిపారు. నంజంపేట, సోమలలో వీధి కుక్కల దాడిలో లేగదూడలు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని ఎంపీటీసీ జిన్నా పేర్కొన్నారు. పాయలగుట్టలో నెలకొన్న సమస్యలు పరిష్క రించాలని పీఆర్ శేఖర్ కోరారు. ప్రభుత్వ భూములు, వంకలు, వాగులు అన్యాక్రాంతం కాకుండా వీఆర్వోలు జాగ్రత్తగా వ్యవహరించాలని తహసీల్దార్ బెన్నిరాజ్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ కుసుమ, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్ హరిత, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, మండల కో-ఆప్షన్ సభ్యులు మస్తాన్, ఏవో సుధాకర్, పశువైద్యాధికారి చందనప్రియ, ఏఈ అనూష, ఏపీఎం శివ, ఏపీఎం దినకర్, ఎంఈవో శ్రీరాములు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ బెన్నిరాజ్

పోలీసు బందో బస్తు నడుమ మండల మీట్

మండల సమావేశం ఎస్‌ఐ శివశంకర ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తు నడుమ కొనసాగింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వైసీపీ ప్రజాప్రతినిధులు ఉండడంతో ఎలాంటి వివాదాలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

పిచ్చికుక్క వీరంగం

పుంగనూరు రూరల్, ఆగస్టు16: మండలంలోని వనమలదిన్నె పంచాయతీ మేకజామునపల్లెలో పిచ్చికుక్క వీరంగం సృష్టించి వ్యక్తిపై దాడి చేసి గాయపరచడంతో పాటు నాలుగు ఆవులను కాటు వేసింది. మేకనజామునపల్లె సమీపంలో క్వారీలో పని చేస్తున్న కూలీ సుదీప్(32) పిచ్చికుక్క కాటుకు గురయ్యాడు. అప్పటికే గ్రామంలోని నాలుగు ఆవులను కాటు వేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

అమ్మవారికి కుంకుమార్చన



సోమల, ఆగస్టు 16: మండలంలోని ఆవులపల్లె ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. టీటీడీ ఆధ్వర్యంలో అర్చకులు గోపీస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు చేసి పంచామృతాభిషేకం, సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మహిళలు ఇంటింటా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం







కుప్పంలోని ప్రభుత్వ కళాశాలలో వ్రతం చేసుకుంటున్న మహిళలు, గుడుపల్లె మండలం పెద్దబదనవాడలోని ఓ ఇంట్లో అమ్మవారికి అలంకరణ, రొంపిచెర్లలో వరలక్ష్మీ ప్రతిమలకు పూజలు

కుప్పం, ఆగస్టు 16: కుప్పంలో శుక్రవారం ప్రజలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాల ప్రాంగణంలో సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో వేదబ్రహ్మ బాలసుబ్రమణ్యం ప్రజలచేత వరలక్ష్మీ వ్రతాన్ని చేయించారు. లక్ష్మీదేవి స్వరూపాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. సాయి మాతా సేవాట్రస్టు తరఫున జగదీశ్‌బాబు వ్రతంలో పాల్గొన్న వారికి రవిక, పసుపు కుంకుమ, గాజులు, తాంబూలంతో కూడిన వాయినాలు అందించారు. ఎంఎఫ్‌సీ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ జ్యోతి స్వరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడుపల్లె: మండలంలోని ప్రజలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహిం చుకున్నారు. గుడుపల్లెలోని వెంకటేశ్వరస్వామి, కనమన పల్లెలోని శ్రీనివాసస్వామి, మల్లప్పకొండలోని మల్లేశ్వరుడు, ఒంటిపల్లె రాళ్లగంగమాంబ, కాడేపల్లెలోని నాగదీశ్వరుడు, సిరిగిరిపల్లెలోని తిమ్మరాయ స్వామి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇళ్లల్లో లక్ష్మీ ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించారు. పిండి వంటలు, వివిధ రకాల పండ్లు, పట్టువస్త్రాలు, గాజులు, నగదును ఉంచి ఇళ్లల్లో మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని చేశారు. గ్రామంలోని మహిళలకు పసుపు, కుంకుమ సారె అందించారు.

రొంపిచెర్ల: మండలంలోని శివాలయాల్లో పార్వతీ అమ్మవారికి, పెద్దమల్లెల నడింపల్లె చౌడేశ్వరి అమ్మవారికి, గృహాల్లో వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేసి వరలక్ష్మీ వ్రతం పూజలు చేశారు. గణపతి పూజ, అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేకాలంకరణ, కుంకుమార్చనలతో పాటు అమ్మవారి వ్రత మహత్యం గురించి పురోహితులు మహిళలకు వినిపించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు16: పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన శుక్రవారం పెద్దపంజాణి మండలంలో జరిగింది.. పెద్దపంజాణి మండలంలోని దెయ్యాలగడ్డకు చెందిన రెడ్డెప్ప ,సుజాత(30) దంపతులు. వ్యవసాయ పనులు చేసి జీవనం సాగించేవారు. కుటుంబంలో చిన్నచిన్న సమస్యతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో సుజాత ఇంట్లోని పురుగుల మందు తాగిసింది. కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించండి


కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, ఆగస్టు 16: నగరంలో ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న అనధికార బ్యానర్లు, ఫ్లెక్సీలను సత్వరం తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు రావడంతో శుక్రవారం ఆమె నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ఫ్లెక్సీలు, బ్యానర్లను పరిశీలించారు. కొంగారెడ్డిపల్లె, కలెక్టర్ బంగ్లా రోడ్డు, గాంధీ సర్కిల్, సంతపేట, ఎంఎస్‌ఆర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో బ్యానర్ల తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు కోసం అనుమతి తీసుకోవాలన్నారు. ఏసీపీ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు


శ్రీనివాస్‌కు జ్ఞాపిక ఇస్తున్న ఇన్‌చార్జి ఈవో వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 16: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆలయ పునర్నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్, సినీ నిర్మాత కేఎల్ నారాయణ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఇన్‌చార్జి ఈవో వాణి స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

నగరి సీఐ బాధ్యతల స్వీకరణ



నగరి, ఆగస్టు 16 : పట్టణ సీఐగా మహేశ్వర్ శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. శాంతిభద్రతల రక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతి

యాదమరి, ఆగస్టు 16: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతి మండలంలోని మాదిరెడ్డిపల్లె పీహెచ్‌సీపరిధిలో గల రసూల్‌నగర్‌ను తనిఖీ చేశారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. డెంగ్యూ కేసు నిర్ధారణ అయిన రబియా గృహాన్ని సందర్శించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు, నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పారిశుధ్యం లోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీధుల్లో పారుతున్న మురికినీటిని అరికట్టాలని పంచాయతీ కార్యదర్శి గోపినాథ్‌ను ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు ఉత్సవం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16: పలమనేరు రోడ్డులోని సయ్యద్‌షా గులాం రసూల్ బాబా దర్గాలో రెండు రోజులుగా ఉరుసు మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. హజరత్ మురాద్ అతీఫ్, అజీమ్ తాజ్‌ల కవ్వాలి అలరించింది.

అంకాల పరమేశ్వరికి విశేష పూజలు



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16: ఆడిమాసం చివరి శుక్రవారం సందర్భంగా గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారిని గాజులు, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో లక్ష దీపారాధన చేశారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 16: బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం స్థానిక రాంగనగర్ కాలనీలోని హార్వర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ భాస్కర్ తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

19న సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16: గిరింపేట చెంగల్‌రాయ కొండ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో ఈనెల 19న శ్రావణ పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు ఈవో సుబ్బారెడ్డి తెలిపారు. స్వామి వారిని అభిషేకించి, పూజలు నిర్వహించి, ప్రత్యేక రథంపై పుర వీధుల్లో ఊరేగించనున్నట్లు ఉత్సవ ధర్మకర్త పూల సుబ్రమణ్యం నాయుడు తెలిపారు. కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో పల్లకి సేవ నిర్వహించనున్నట్లు జిల్లా కార్యవర్గం తెలిపింది.

19న జంధ్యాల పండగ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16: శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈనెల 19న రక్షా బంధనం (రాఖీ), జంధ్యాల పండగలను నిర్వహించనున్నారు. శాస్త్రోక్తంగా పాత యజ్ఞోపవీతాలు(జంధ్యాలు) విసర్జించి, కొత్తవి ధరించనున్నారు. అందుకు గాను నగరంలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

20నుంచి సుగుణేంద్ర తీర్థుల ఆరాధనోత్సవాలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16: గిరింపేట సుగుణేంద్ర తీర్థ మూల సన్నిధానంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో స్వామి వారి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. రోజూ వేద పారాయణం, అష్టోత్తర పారాయణం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కనకాభిషేకాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నగర వాసులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి


గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

బంగారుపాళ్యం, ఆగస్టు 16: స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న గౌడ్ జయంతి వేడుకలను శుక్రవారం గౌడ సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూజలు చేసి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏపీ రాష్ట్ర గౌడ సంఘం కార్యదర్శి బుస్సా నాగరాజ గౌడ్ మాట్లాడుతూ మండలంలో ఇదివరకే లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని గాలికొదిలేసిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర గౌడ్, ఎల్లప్ప గౌడ్, మురళి, రెడ్డెప్ప, రాజమాణిక్యం, గోపి తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు ఎంపీడీవోగా ధనలక్ష్మి



పూతలపట్టు, ఆగస్టు 16: పూతలపట్టు ఎంపీడీవోగా ధనలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె తవణంపల్లె ఎంపీడీవోగా ఉంటూ సెలవుపై వెళ్లి, పూతలపట్టు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న ప్రసన్న కుమారి బదిలీపై వెళ్లారు.

సహకార సంఘ ఓటర్లు కేవైసీ చేసుకోవాలి

పూతలపట్టు, ఆగస్టు 16: సహకార సంఘంలో ఓటు హక్కు కలిగిన రైతులు తప్పనిసరిగా కేవైసీ చేసుకోవాలని ఎర్రచెరువుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చీఫ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్ నాయుడు, పర్సనల్ ఇన్‌చార్జి సులోచన, సూపర్‌వైజర్ రాజు శ్రీవత్సల, సీవో మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పుస్తకం జిరాక్సులు ఈనెల 30వ తేదీ లోగా అందించాలని కోరారు.

కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ



నగరి, ఆగస్టు 16: తమిళనాడు తిరువణ్ణామలైలో గురువారం నిర్వహించిన 48వ జపాన్ షిటోరాయ్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కరాటే మాస్టర్ అన్నాదొరై తెలిపారు. నగరి నుంచి 18 మంది పాల్గొనగా కియోస్, కటా, కుమితి విభాగాలలో అవార్డులు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు చెప్పారు.

చంద్రమౌళీశ్వరాలయానికి కానుకగా పంచలోహ విగ్రహాలు



నగరి, ఆగస్టు 16 : నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వరాలయానికి శివపార్వతుల పంచ లోహ విగ్రహాలను చెన్నైకి చెందిన సావిత్రి బహూకరించారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చిన ఆమె విగ్రహాలను ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యంకు అందించారు. ఈనెల 22వ తేదీన ఆలయ అష్టబంధన కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో విగ్రహాలను అందించినట్లు దాత పేర్కొన్నారు. అనంతరం ఆమె స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రసాదాలు అందజేశారు.

సత్యగంగమ్మకు నోట్ల అలంకరణ



గంగవరం, ఆగస్టు16: పట్టణంలోని పాతపేటలో వెలసిన సత్య గంగమ్మ ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని శ్రావణ శుక్రవారం సందర్భంగా సుమారు. రూ. 3 లక్షల విలువైన రూ.500 నోట్లతో అలంక రించారు. కరెన్సీ నోట్లతో పాటు పూలాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు
వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు
అమ్మవారికి నైవేద్యాల సమర్పణ




చిత్తూరు కన్యకా పరమేశ్వరి ఆలయం - వెదురుకుప్పం మండలం కొండమల్లీశ్వరస్వామి ఆలయం - కన్యకాపరమేశ్వరి ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరవాసులు వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి, భక్తులతో వ్రతం నిర్వహించారు. పొన్నియమ్మ గుడి, కోదండరామాలయం, వెంకటేశ్వరాలయం, బ్రాహ్మణవీధి వాసవి కన్యకాపరమేశ్వరి, అగస్త్యేశ్వరాలయం, గిరింపేట శివగామి సుందరి అమ్మ సమేత చిదంబేశ్వర స్వామి, కట్టమంచి కులందేశ్వర, అత్తి వరదరాజ, సంతపేట విజయలక్ష్మి కాలనీలోని శ్రీరంగనాథ, చవటపల్లె కనకదుర్గ, సీబీ రోడ్డు వీరాంజనేయ, 75 దొడ్డిపల్లె పచ్చయమ్మన్, సప్తకన్నికల ఆలయాల్లో అర్చకులు వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. రంగాచ్చారి వీధి రామవిలాస సభలో వెలసిన శ్రీరంగనాథ స్వామికి విశేష పూజలు చేశారు. జల, పాలాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నగరి : పట్టణం, మండల పరిధిలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం ఘనంగా చేసుకున్నారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన వ్రతంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉపవాసాలు ఉంటూ సకల సౌభాగ్యాలు చేకూరాలని ప్రార్థించారు.

పాలసముద్రం : రాచపాళ్యంలోని బాలగురునాదీశ్వరాలయం, శ్రీకావేరిరాజుపురం అమ్మవారి ఆలయం, బలిజకండ్రిగలోని చెవిటి గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గ్రామాల్లో మహిళలు గౌరమ్మను నెలకొల్పి, ప్రత్యేక పూజలు చేశారు.

గుడిపాల : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

నింద్ర : కూనమరాజుపాలెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, గీతా మందిరంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహాలక్ష్మి యాగం నిర్వహించారు. గీతా మందిర ఆశ్రమాధిపతి పుండరీక పరదానంద స్వామి పాల్గొన్నారు. హోమం ముగిసిన తర్వాత సామూహికంగా వరలక్ష్మీవ్రతం, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ నిర్వహించారు.

విజయపురం : మండలంలోని పన్నూరు ఆనందవల్లి సమేత ఇష్టకామేశ్వరస్వామి, జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో, పాతార్కాడు, మహారాజపురంలో విఘ్నేశ్వరస్వామి, ఆలపాకం మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు బాలసుబ్రహ్మణ్యంశర్మ, రాంప్రసాద్‌శర్మ, వందవాసి మహేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం : డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం : వృద్ధురాలికి గాయాలు



గుడిపాల, ఆగస్టు 16: బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని 190 రామాపురం సీఎంసీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. సుశీలమ్మ అనే వృద్ధురాలు సీఎంసీ వద్ద చిత్తూరుకు వెళ్లేందుకు బస్సు ఆపింది. ఎక్కే క్రమంలో పట్టుతప్పి కిందపడింది. వెనుకవైపు వస్తున్న మరో బస్సు ఆమె ఎడమ కాలిపై ఎక్కడంతో నుజ్జునుజ్జు అయింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండో పట్టణ సీఐ బాధ్యతల స్వీకరణ




బాధ్యతలు తీసుకుంటున్న సీఐ నెట్టికంఠయ్య - ఎస్‌బీ సీఐ భాస్కర్ - రమేష్‌బాబు

చిత్తూరు, ఆగస్టు 16: చిత్తూరు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా ఉన్న ఉలసయ్యను ప్రభుత్వం వీఆర్‌కు పంపింది. తిరుపతి పీటీసీలో ఉన్న నెట్టికంఠయ్యను బదిలీపై చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు తీసుకుని మర్యాదపూర్వకంగా ఎస్పీ మణికంఠను కలిశారు. ఎస్‌బీ సీఐగా భాస్కర్ కూడా బాధ్యతలు స్వీకరించారు. తాలూకా ఎస్‌ఐగా ఉన్న ఉమామహేశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం వీఆర్‌కు తీసుకోగా ఆయన స్థానంలో రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

నడి రోడ్డుపై గొయ్యి



పెనుమూరు, ఆగస్టు 16: అసలే గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్న ప్రయాణికులకు నడిరోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి మరింత తలనొప్పిగా మారింది. పెనుమూరు నుంచి చిత్తూరు వైపు వెళ్లే మార్గంలో రేణుక నగర్ మలుపు వద్ద కల్వర్టు ఉంది. కొన్ని రోజులుగా ఇక్కడ రోడ్డు దెబ్బతిని గుంత ఏర్పడింది. పట్టించుకోకపోవడంతో పెద్ద గొయ్యిలాగా మారింది. మలుపు రోడ్డు కావడంతో గురువారం రాత్రి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు అందులో పడి గాయాలపాలయ్యారు. దారిన పోయేవారు ఆ రంధ్రానికి చుట్టూ రాళ్లు, కంపలు వేశారు. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 16: కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి 19వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి, 18, 19 తేదీల్లో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటలకు తెప్పలపై విహరిస్తారు. ఈ మూడు రోజులు ఉదయం 9.30నుంచి 10.30 వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మా భూమి కబ్జా చేశారు..న్యాయం చేయండి

చిత్తూరు సిటీ, ఆగస్టు 16: వీఆర్‌వో, సర్వేయర్లతో కలసి తమ భూమిని కబ్జా చేశారని యాదమరి మండలం 184 గొల్లపల్లి పంచాయతీ పేరకూరు గ్రామానికి చెందిన పవన్ కల్యాణ్, నాగరాజు, మణికంఠ, పార్వతి ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ గ్రామంలో 251/1, 258/2, 258/3 సర్వే నంబర్లతో ఉన్న భూమిని తాతల కాలం నుంచి అనుభవంలో ఉందన్నారు. గ్రామానికి చెందిన శేఖర్, లోకేష్, ద్రాక్షాయని భూమిని కౌలుకు తీసుకుని వీఆర్‌వో, సర్వేయర్లతో కలిసి రికార్డులు తారుమారు చేసి కబ్జా చేశారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో రికార్డులు తమ పేరిటే ఉన్నాయని అన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇదే విషయం చెప్పారన్నారు. కాగా, కబ్జాదారులు ఆ భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు.

డ్యూటీ ఆపరేటర్లు విధులు సక్రమంగా నిర్వహించాలి


అధికారులతో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

పూతలపట్టు, ఆగస్టు 16: సబ్‌స్టేషన్ డ్యూటీ ఆపరేటర్లు విధులను సక్రమంగా నిర్వహించాలని విద్యుత్ శాఖ ఈఈ మునిచంద్ర కోరారు. శుక్రవారం ఆయన పూతలపట్టు సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. షిఫ్ట్ ఆపరేటర్లు ప్రతి గంటకూ రీడింగ్ తీయాలన్నారు. 11కేవీ లైన్‌లో ట్రీకటింగ్ చేసి వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. వ్యవసాయ బిల్లుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. ఏడీఈ జ్ఞానేశ్వర్, ఏఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయపురం, ఆగస్టు 16: మండలంలో విద్యుత్ లైన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ చంద్రబాబు తెలిపారు. విషయాన్ని గమనించి, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టెంకాయ మొక్కలు పీకేశారని ఫిర్యాదు

పెనుమూరు, ఆగస్టు 16: తన పొలంలో నాటిన 60 కొబ్బరి మొక్కలు పీకేశారని మండలంలోని మోపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గోవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నాన్న కొడుకే ఈ పని చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బోరు మోటార్లు కూడా కనిపించడం లేదని, పైపులను ధ్వంసం చేశాడని తెలిపారు.

ఖైదీలకు అడల్ట్ బీసీజీ టీకాలు



చిత్తూరు సిటీ, ఆగస్టు 16: జిల్లా జైలులోని ఖైదీలకు అడల్ట్ బీసీజీ టీకాలు వేశారు. శుక్రవారం 28 మంది ఖైదీలకు, జైలు అధికారులు, సిబ్బందికి టీకాలు వేశారు. క్షయవ్యాధి లక్షణాలున్న 8 మంది ఖైదీల కఫం సేకరించి, పరీక్ష కేంద్రానికి పంపించారు. జిల్లా టీబీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సంతోష్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, సూపర్‌వైజర్ మోహన్ ప్రసాద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును రద్దు చేయాలి

వెదురుకుప్పం, ఆగస్టు 16: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని ఎస్సీ(మాల) ఉపాధ్యాయ సంఘ నాయకులు చలపతి, దొరబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్వేటినగరం ఎంపీడీవో కాంప్లెక్స్ ఏరియాలో వారు సమావేశమయ్యారు. మాల, మాదిగల మధ్య చిచ్చురేపడం మంచిది కాదన్నారు.

కంటి పరీక్షలను ఉపయోగించుకోండి

ఐరాల, ఆగస్టు 16: మండలంలోని చంద్రయ్యగారిపల్లెలో ఆదివారం నిర్వహించనున్న కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు జాలారి మల్లయ్యనాయుడు కోరారు. చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వారి సౌజన్యంతో కంటి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి అద్దాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామని, భోజన వసతి ఉంటుందని వివరించారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి


వేదమణి (ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం, ఆగస్టు 16: మండలంలోని 49.కొత్తపల్లెమిట్ట సర్పంచ్ డి.వి.డిల్లెయ్య భార్య, అంగన్‌వాడీ టీచర్ (లింకు సూపర్‌వైజార్) డి.వేదమణి (55) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, అంగర్‌వాడీ వర్కర్లు ఆమె మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

టీడీపీతోనే ప్రశాంత పాలన

గుడిపాల, ఆగస్టు 16: కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పాలన ప్రశాంతంగా సాగుతోందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడుతూ పాడి పంటలు పండించడానికి అనువైన వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. చంద్రబాబు వస్తే కరువు వస్తుందని కొందరు దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు.




ఆగిపోయిన నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ భవన నిర్మాణం - ప్రారంభానికి నోచని నల్లవెంగనపల్లె రైతు సేవా కేంద్రం - ప్రారంభం కాని నల్లవెంగనపల్లె హెల్త్ క్లీనిక్ సెంటర్

ప్రభుత్వ కార్యాలయాలకు రాజకీయ గ్రహణం

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచని వైనం

వెదురుకుప్పం, ఆగస్టు 16: రూ.లక్షలు పోసి ప్రభుత్వ సొంత భవన నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ భవన నిర్మాణం మొదటి అంతస్తు వరకు వేగంగా సాగింది. రెండో అంతస్తు కోసం రూ.25లక్షలు నిధులు వచ్చాయి. అయితే బిల్లులు సరిగా మంజూరు చేయడం లేదన్న కారణంగా కాంట్రాక్టరు అర్ధంతరంగా ఆపేశాడు. అప్పటి వైసీపీ పాలకులు కూడా దీని గురించి పట్టించుకోకపోవడంతో సగంలో నిలిచిపోయింది. ఇకపోతే హెల్త్ క్లీనిక్ సెంటర్‌కు రూ.20.80 లక్షలు, రైతు భరోసా భవన నిర్మాణానికి రూ.21.8లక్షలు ఇచ్చారు. నత్తలతో పోటీపడి ఎట్టకేలకు పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తున్నాయి. వీటి గురించి గత పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుత పాలకులు కూడా అటు వైపు చూడడం లేదని గ్రామస్తులు అంటున్నారు. సచివాలయ భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉద్యోగులు ఇరుకు గదుల్లో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా భవనాల ప్రారంభోత్సవానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.